ఏఐఎస్‌ఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవం



ఘట్‌కేసర్‌లో ఏఐఎస్‌ఎఫ్‌ జెండా ఆవిష్కరిస్తున్న అన్వర్‌, శ్వేత

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ పట్టణంలో ఏఐఎస్‌ఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవం ఆ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ చౌరస్తాలో ఏఐఎస్‌ఎఫ్‌ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులు ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి అన్వర్‌, శ్వేత మాట్లాడుతూ విద్యావ్యతిరేక విధానాలపై ఏఐఎస్‌ఎఫ్‌ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హరీశ్‌, మండల అధ్యక్షుడు అజయ్‌, నాయకులు మహేశ్‌, జస్వంత్‌, విక్రమ్‌ సాయి, ఆకాశ్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎన్‌జీవో కాలనీలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్‌ దీపికారెడ్డి

మేడ్చల్‌: మేడ్చల్‌ 16వ వార్డు పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణపనులను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దీపికా నర్సింహారెడ్డి కౌన్సిలర్‌ ఉమానాగరాజుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు రోడ్లను ఆమె పూజాకార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాలనీల్లో బీటీ, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్‌ నాగిరెడ్డి, ఎన్‌జీవో కాలనీ వాసులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



నాగారంలో జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమంలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సత్యనారాయణ కాలనీ పార్క్‌ వద్ద మంగళవారం జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని, ఆగస్టు 15న జరిగే జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు అక్కాల సురేష్‌, రవీందర్‌రెడ్డి, కాలనీవాసులు రెడ్యానాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎంపిక



ఎన్నికైన కీసర మండల పీఆర్‌టీయూ కమిటీ

కీసర: చీర్యాలలోని ప్రాథమిక పాఠశాలలో కీసర మండల పీఆర్‌టీయూ నూతన కమిటీని సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చీర యాదగిరి, ప్రధానకార్యదర్శిగా ఈగ శ్రీనివాస్‌, అసోసియేట్‌ అధ్యక్షుడిగా చెన్నూరు శ్రీనివాస్‌, ఉపాధ్యక్షులుగా జి.వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా విజయశ్రీ, సెక్రటరీగా పూంద్రు సుధాకర్‌, మహిళా కార్యదర్శిగా జ్యోత్స్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్‌ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వం ఉన్న సంఘంగా పీఆర్‌టీయూ నిలిచిందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు వేదవతి, విద్యాసాగర్‌, వెంకటేశం, జిల్లా బాధ్యులు వెంకట్‌రెడ్డి, రవీందర్‌, నాయకులు రామచంద్రయ్య, ప్రవీణ్‌, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌ యాజమాన్యంపై జరిమానా




అన్నపూర్ణ హోటల్‌ యజమానికి జరిమానా విధిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ పట్టణంలోని అన్నపూర్ణ హోటల్‌ టిఫిన్‌లో పురుగులు వస్తున్నాయన్న ఆరోపణలపై మున్సిపాలిటీ కమిషనర్‌ ఆదేశం మేరకు మేనేజర్‌ వెంకట్‌రెడ్డి, ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌, పోలీసులు సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు చేపట్టారు. వంట గదిని పరిశీలించారు. వడ్డించడానికి సిద్ధం చేసిన పలు వంటకాల శాంపిల్స్‌ను సేకరించారు. నిషేధిత ప్లాస్టిక్‌ కవర్లను సీజ్‌ చేశారు. అనంతరం నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నందుకు రూ.8 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటల్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, నిషేధిత ప్లాస్టిక్‌ను వాడతే ఉపేక్షించేది లేదని హోటల్‌ యజమానులను హెచ్చరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్‌

పోచారం: ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్‌ ఎక్సైజ్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఎక్సైజ్‌ సీఐ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం... కీసర మండల పరిధిలోని రాంపల్లి క్రాస్‌ రోడ్‌ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రాంపల్లిలోని డీఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌కు చెందిన జాతోతు రమేష్‌ (42) వద్ద 3.645 కిలోల ఎండు గంజాయి లభించింది. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఒరిస్సా సరిహద్దు దగ్గరున్న పాడేరు నుంచి గంజాయి తీసుకొచ్చి కీసర, ఘట్‌కేసర్‌ మండలాల పరిధిలోని వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు చెప్పాడు. ముద్దాయిపై గతంలో ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌లోనూ కేసు నమోదైంది. పోలీసులు గంజాయితోపాటు సెల్‌ఫోన్‌, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని కోర్టులో హాజరుపర్చి అనంతరం రిమాండ్‌ చేశారు.

జ్వరపీడితులు 5,602 మంది



212 మందికి డెంగీ, ఇద్దరికి టైఫాయిడ్‌, మలేరియా

- సీజనల్‌ వ్యాధులను ఎదుర్కొనేందుకు వైద్యారోగ్యశాఖ ఫీవర్‌ సర్వే
- దోమలు, అపరిశుభ్ర నీరు, ఆహారంపై ప్రజల్లో అవగాహన
- జ్వర పీడితులకు ఇంటి వద్దనే మందుల అందజేత



ఇంటింటా జ్వర సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: సీజనల్‌ వ్యాధులను ఎదుర్కొనేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇంటింటా జ్వర సర్వే చేపట్టి జ్వర పీడితులు, అనారోగ్యం బారినపడ్డ వారిని గుర్తించి వైద్యసేవలు అందజేస్తోంది. సీజనల్‌ వ్యాధులు విజృంభించకుండా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచనల మేరకు మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఈ సర్వే నిర్వహిస్తోంది. జిల్లాలో ఇదివరకు డెంగీ, వైరల్‌ ఫీవర్‌ వంటి వ్యాధులు ప్రబలిన ఏరియాలు, మురికివాడలు, బస్తీలతోపాటు హైరిస్క్‌ ప్రాంతాలుగా గుర్తించిన పట్టణ, గ్రామాల్లో ఆశా, ఎఎన్‌ఎంలు, మండల వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వహిస్తున్నారు. ఆశా, ఏఎన్‌ఎంల బృందం ప్రతిరోజు దాదాపు 50 ఇళ్లు తిరిగి అనారోగ్యంతో ఉన్నవారి వివరాలను సేకరిస్తోంది. వెంటనే సంబంధిత పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ, పల్లె దవాఖానాల వైద్యాధికారులకు సమాచారాన్ని అందజేస్తోంది. ఈ మేరకు సంబంధిత రోగి వద్దకు వైద్యాధికారులు వెళ్లి అవసరమైన మందులు అందజేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని ఆసుపత్రులకు రెఫర్‌ చేస్తున్నారు.

ప్రజల్లో అవగాహన కల్పిస్తూ...

మేడ్చల్‌-మల్కాజిరిగి జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఈ నెల 5 నుంచి మంగళవారం నాటికి 2,30,012 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 8,05,044 మంది నుంచి వివరాలు సేకరించగా, 5,602 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు అందజేశారు. ఇందులో 212 డెంగీ, రెండు టైఫాయిడ్‌, మలేరియా కేసులు నమోదయ్యాయి. వారికి వైద్యసేవలను సంబంధిత పీహెచ్‌సీల వైద్యులు అందిస్తున్నారు. సర్వే నిర్వహిస్తూనే వ్యాధుల కారకాలైన దోమలు, అపరిశుభ్రత, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అపరిశుభ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలు, బస్తీలు, పురపాలికల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్‌ చేయాలని సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

ఇంటింటికీ మందులు అందజేస్తున్నాం



సీజనల్‌ వ్యాధులు బారిన పడ్డవారిని గుర్తించేందుకు మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో ఇంటింటా ఫీవర్‌ సర్వే నిర్వహిస్తున్నాం. జ్వరాలతో బాధపడే వారిని పీహెచ్‌సీలు, యూపీ హెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తున్నారు. - డాక్టర్‌ రఘునాథ్‌ స్వామి, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్‌-మల్కాజిగిరి

బస్సు బుకింగ్‌పై 10 శాతం రాయితీ

మేడ్చల్‌: ఎవరైనా తమ కుటుంబాల శుభకార్యాలకు ఆర్టీసీ బస్సు బుక్‌ చేసుకుంటే 10 శాతం రాయితీ అందిస్తున్నామని మేడ్చల్‌ ఆర్టీసీ డిపో మేనేజర్‌ సుధాకర్‌ తెలిపారు. బుధవారం(నేటి) నుంచి సెప్టెంబర్‌ 3వ తేదీ వరకు బస్సులు బుక్‌ చేసుకునేవారికి ఈ అవకాశం ఉంటుందన్నారు. ఆర్టీసీలోని అన్ని రకాల బస్సుల బుకింగ్‌పై 10 శాతం రాయితీ ఉంటుందని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా జవాన్ల తిరంగా యాత్ర

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని సీఆర్‌పీఎఫ్‌ నుంచి అరుంధతినగర్‌ ప్రాంతాల్లో దేశభక్తిని చాటుతూ సీఆర్‌పీఎఫ్‌ జవాన్లు ఉత్సాహంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్‌ అధికారులు మాట్లాడుతూ దేశ భద్రతే జవాన్ల లక్ష్యమని, దేశం కోసం జవాన్లు ప్రాణ త్యాగానికైనా వెనకడుగు వేయరన్నారు. దేశ సేవలో నేటి యువత ముందుండాలని సూచించారు.

ఈ-లైబ్రరీలను వినియోగించుకోవాలి

మేడ్చల్‌రూరల్‌: విద్యార్థులు ఈ-లైబ్రరీలను వినియోగించుకోవాలని జే గెట్‌ అండ్‌ ఇన్ఫర్మాటిక్స్‌ ట్రైనింగ్‌ మేనేజర్‌ రతీష్‌ అయ్యర్‌ అన్నారు. మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో జాతీయ లైబ్రేరియన్‌ డే పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. జే గెట్‌ యాప్‌ ఉపయోగించి వేలాది పుస్తకాలు, జర్నల్స్‌ ఉచితంగా ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు అని విషయంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను కళాశాల ప్రిన్సిపాల్‌ అశోక్‌ వివరించారు. కార్యక్రమంలో డీన్‌లు రాజేశ్వరన్‌, అధిరాజ్‌, వివేకానంద, నర్సింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నూరు శాతం పన్నులు వసూలు చేయాలని బిల్‌ కలెక్టర్లను చైర్మన్‌ కొండల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పోచారం మున్సిపల్‌ ఆఫీస్‌లో రెవెన్యూ, శానిటేషన్‌ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొండి బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించి తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటేషన్‌ సిబ్బందికి సూచించారు. సమావేశంలో వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, కమిషనర్‌ వేమనరెడ్డి, మేనేజర్‌ అంజన్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ వాణి, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు అధికారి అదృశ్యం



సంతోష్‌ (ఫైల్‌)

పోచారం: బ్యాంక్‌ అధికారి అదృశ్యమైన సంఘటన పోచారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సింగపూర్‌ టౌన్‌షిప్‌లో ఉన్న యాక్సిస్‌ బ్యాంక్‌లో గుడిమల్కాపూర్‌కు చెందిన జి.సంతోష్‌(35) డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య దీపిక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు విధులకు వెళ్లి రాత్రి 10:30 గంటలకు ఇంటికి చేరుకునేవారు. కాగా, సోమవారం విధులకు వెళ్లి తిరిగి రాలేదు. ఎన్నిచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోచారం పోలీస్‌స్టేషన్‌లో అతడి అన్న శశినాథ్‌ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడికి లాభం పేరిట మోసం

రూ. లక్షా 35 వేలు కోల్పోయిన బాధితుడు

ఘట్‌కేసర్‌: తమ ఖాతాలో పెట్టుబడి పెడితే రెండింతల లాభం వస్తుందని నమ్మించి డబ్బులు డిపాజిట్‌ చేయించుకొని మోసగించిన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... ఘట్‌కేసర్‌కు చెందిన అక్తరుల్‌ హక్‌(27) ఫోన్‌కు తమ ఖాతాలో డబ్బులు జమా చేస్తే ఎక్కువ లాభం వస్తుందని 2023, అక్టోబర్‌ 15న అజ్ఞాత వ్యక్తి టెలిగ్రామ్‌ ఐడీ నుంచి మెసేజ్‌ వచ్చింది. దీంతో అక్తరుల్‌ హక్‌ ఆశపడి రూ. 20 వేలు పంపించాడు. మరింత పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుందనడంతో విడతలవారీగా రూ. 25 వేలు, రూ.65 వేలు, రూ. 5 వేలు, రూ. 25 వేలు మొత్తం రూ. లక్షా 35 వేలు డిపాజిట్‌ చేశాడు. మరింత డబ్బులు పంపాలని అజ్ఞాత వ్యక్తి చెప్పడంతో మోసపోయానని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సురక్షిత ఔషధాలు తయారు చేయాలి: కలెక్టర్‌



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

శామీర్‌పేట్‌: వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపకుండా సురక్షితమైన ఔషధాలనే ఫార్మా కంపెనీలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ పోట్రు సూచించారు. మంగళవారం శామీర్‌పేట్‌ జినోమ్‌ వ్యాలీలోని కెమో ఇండియా ఫార్ములేషన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, భారత్‌ బయోటెక్‌, బయోలాజికల్‌ ఇ లిమిటెడ్‌ కంపెనీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఔషధాల తయారీలో ప్రామాణికతను కంపెనీలు పాటించాలని, క్రమపద్ధతిలో పరిశోధనలు చేసి నాణ్యమైన ఫలితాలను సాధించాలని సూచించారు. ప్రపంచ స్థితిగతులకు అనుగుణంగా మందులు తయారు చేయాలని కోరారు. జనాభాకు తగ్గట్టుగా సామాన్య ప్రజానీకం కొనుగోలు చేయదగిన ధరల్లో మందులను ఉత్పత్తి చేయాలన్నారు. కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సరైన భద్రత కల్పిచడంతోపాటు ఊహించని ప్రమాదాలు సంభవిస్తే యాజమాన్యం బాధ్యతగా స్పందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐసీ జనరల్‌ మేనేజర్‌ ప్రశాంత్‌ కుమార్‌, డిప్యూటీ డైరెక్టర్‌ కె.చంద్రశేఖర్‌ బాబు, ఇండస్ట్రియల్‌ ప్రమోషన్‌ ఆఫీసర్లు ఎం.వి.వెంకటశేఖర్‌, జి.సాయికృష్ణ, టీజీఐఐసీ జోనల్‌ మేనేజర్‌ అనురాధ, ఐలా కమిషనర్‌ డి.వినయ్‌ కుమార్‌, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఫార్మా కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్‌ గౌతమ్‌

ర్యాగింగ్‌ రహిత కళాశాలగా మార్చాలి

మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి



ఈవ్‌ టీజింగ్‌, డ్రగ్స్‌ నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ చక్రపాణి, రమేశ్‌, ఇతర అధికారులు

ఘట్‌కేసర్‌: ర్యాగింగ్‌ రహిత కళాశాలగా మార్చడానికి విద్యార్థులు కృషి చేయాలని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి అన్నారు. ఎదులాబాద్‌ మెగా, ఎన్‌ఎఫ్‌సీ నగర్‌ మదర్‌ థెరిసా ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్‌, డ్రగ్స్‌ నిర్మూలనపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈవ్‌ టీజింగ్‌, ర్యాగింగ్‌ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని, జూనియర్‌ విద్యార్థులను స్నేహితులుగా భావించాలన్నారు. అనంతరం ర్యాగింగ్‌, డ్రగ్స్‌ వాడకం, ఈవ్‌ టీజింగ్‌, ధూమపానం వంటి దురలవాట్ల నివారణపై విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్‌, ఇన్‌స్పెక్టర్‌లు సైదులు, శ్రీనివాస్‌రావు, నార్కోటిక్‌, ఇతర పోలీస్‌ అధికారులు, మెగా, మథర్‌థెరీసా విద్యార్థులు పాల్గొన్నారు.



ఈవ్‌ టీజింగ్‌, డ్రగ్స్‌ అవగాహన సదస్సులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రియల్టర్ల భూదాహం.. చెరువులు మాయం

- కబ్జా అవుతున్న మేడ్చల్‌ నియోజకవర్గంలోని చెరువులు
- హైడ్రా గుర్తించిన 52 చెరువుల్లో మేడ్చల్‌కు చెందినవే 15

మేడ్చల్‌: రియల్టర్ల భూదాహానికి మేడ్చల్‌ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు మాయమవుతున్నాయి. ఉమ్మడి కీసర, జవహర్‌నగర్‌, శామీర్‌పేట్‌, ఘట్‌కేసర్‌, మేడ్చల్‌ మండలాల్లోని చెరువులు, కుంటలు చాలావరకు కుంచించుకుపోయాయి. చెరువులేమో కుంటలుగా మారడం .. కుంటలేమో పూర్తిగా మాయమవడంతో నీటి నిల్వలు లేకుండా పోయాయి. భూగర్భ జలాలు అంతకంతకూ పడిపోతున్నాయి. నగర శివార్లలో ఉన్న మేడ్చల్‌ రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారంతో కాంక్రీట్‌ జంగిల్‌గా మారుతోంది. చెరువుల అంచున ఉన్న భూములకు రెక్కలు రావడంతో రియల్‌ వ్యాపారులు శిఖం, పంట కాలువల భూములను, ఎఫ్‌టీఎల్‌ పరిధిలో ఉన్న భూములను కబ్జాలు చేస్తూ ప్లాట్లుగా మారుస్తున్నారు.

ప్రధానంగా నగర శివారులో ఉన్న పీర్జాదిగూడ, బోడుప్పల్‌, జవహర్‌నగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్లు, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, మున్సిపాలిటీల పరిధిలోని చెరువులు జాడలేకుండా పోయాయి. 15 ఏళ్ల క్రితం ఈ ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాలుగా ఉండేవి. పంటలసాగు కనిపించేది. ఇప్పుడు ఈ ప్రాంతాల్లో వెంచర్లు, గేటెడ్‌ కమ్యూనిటీలు వేగంగా విస్తరించాయి. చెరువులు కబ్జాలకు గురవుతున్నా ఇరిగేషన్‌, రెవెన్యూ అధికారులు, ఆయా గ్రామాలలోని రాజకీయ పార్టీల నాయకులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది బ్లాక్‌ మెయిల్‌ కోసమే ఫిర్యాదు చేసి ఆ తర్వాత మొహం చాటేస్తున్నారు. గ్రామాలలో చెరువుల పరిరక్షణ వ్యవస్థ నిర్వీర్యమైంది. దీంతో రియల్టర్లు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు.

ప్లాట్లుగా విక్రయించి.. సొమ్ము చేసుకుంటూ..

రియల్టర్ల డబ్బుల సంచుల్లోకి చెరువులు చేరాయి. చెరువులను ఎక్కడ పడితే అక్కడ కబ్జాలు చేయడం, ఆ భూములను అందంగా అభివృద్ధి చేసి, ప్లాట్లుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చట్టంలో ఉన్న లొసుగులను, అధికారుల అత్యాశలను ఆసరా చేసుకుని ఎవరికి ఎంత ఇవ్వాలో అంత ఇచ్చుకుంటూ కబ్జాలకు పాల్పడుతున్నారు. దీంతో మేడ్చల్‌ నియోజకవర్గంలోని చెరువులు కబ్జాల చెరలో ఉండిపోతున్నాయి. ప్రభుత్వం చెరువుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా నగరశివారులో 52 చెరువులు కబ్జాలకు గురైనట్లు గుర్తించగా అందులో మేడ్చల్‌ నియోజకవర్గంలోని 15 చెరువులు ఉన్నాయి. గుండ్లపోచంపల్లిలో రెండు, తూంకుంటలో 4 , కీసరలో 4, జవహర్‌ నగర్‌లో 2, పీర్జాదిగూడలో 3 చెరువులు ఉన్నాయి. అహ్మద్‌గూడలోని తుమ్మలకుంటలో నీటికి బదులు ఇళ్లు దర్శనమిస్తున్నాయి. కబ్జాలకు గురవుతున్న చెరువులను కాపాడకపోతే రాబోయే కాలంలో మేడ్చల్‌ వరద ప్రాంతంగా, కరువు ప్రాంతంగా మారే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా అకారులు రియల్టర్ల అక్రమాలపై కొరడా ఝుళిపించి చెరువులను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుండ్లపోచంపల్లి చెరువు ఎఫ్టీఎల్‌లో భవనాలు

ఓటరు నమోదుకు మళ్లీ అవకాశం!



- కొత్త ఓటర్ల నమోదుకు మళ్లీ అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్‌
- ఈ నెల 20 నుంచి ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించనున్న బూత్‌ స్థాయి అధికారులు
- 2025 జనవరి నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చు
- మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో ఓటర్ల సంఖ్య 29.30 లక్షలు

నియోజకవర్గం ఓటర్లు

మేడ్చల్‌	- 6,65,979
మల్కాజిగిరి	- 5,08,048
కుత్బుల్లాపూర్‌	- 7,24,992
కూకట్‌పల్లి	- 4,82,056
ఉప్పల్‌	- 5,49,052
మొత్తం	29,30,127

సాక్షి, సిటీబ్యూరో: కొత్త ఓటర్ల నమోదుకు మళ్లీ అవకాశం వచ్చింది. చిరునామా మార్పులు, సవరణలు, మృతుల పేర్లు తొలగించడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండుతున్న వారు కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించుకోవడానికి అర్హులని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 20 నుంచి బూత్‌ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి సంబంధిత వివరాలపై ఆరా తీయనున్నారు. అర్హత కలిగిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయించడంతోపాటు మృతుల పేర్లను తొలగించనున్నారు. అవసరమైన వారి చిరునామా మార్చనున్నారు. ఓటరు జాబితాలో ఫొటో లేకుంటే సేకరిస్తారు. ఫొటో సరిగా లేకుంటే మరోటి తీసుకుని జాబితాలో చేరుస్తారు.

యువతకు అనుకూలం

మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్‌ తర్వాత ఇంజినీరింగ్‌, డిగ్రీ తత్సమాన కోర్సుల్లో ఏటా వందలాది మంది విద్యార్థులు చేరుతుంటారు. ఈ లెక్కన ప్రతి సంవత్సరం సుమారు 30 వేల కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఓటు హక్కుకు అర్హత సాధిస్తుంటారు. అయితే, ఓటు హక్కు నమోదులో మాత్రం వెనుకంజ వేస్తుంటారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ, ఇటీవలి పార్లమెంట్‌ ఎన్నికల్లో మాత్రం యువత చాలా మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. త్వరలో పంచాయతీ, పురపాలక సంఘాలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలల యజమాన్యాలు విద్యార్థులకు ఓటరు నమోదుపై కొంత అవగాహన కల్పిస్తే నమోదు శాతం పెరుగుతుంది. యువతీ యువకులు బూత్‌ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులను పూరించి ఇస్తే చాలు ఓటరుగా నమోదు కావచ్చు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవడానికి వీలుంది.

ఏ ఫారం దేనికి..

ఫారం: 6 – కొత్తగా ఓటరు నమోదు,
ఫారం: 7- జాబితా నుంచి పేరు తొలగింపు,
ఫారం: 8- తప్పుఒప్పుల సవరణలు,
ఫారం: 6బీ-ఓటరు కార్డుకు ఆధార్‌ అనుసంధానం.
మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాల్లో మొత్తం ఓటర్లు: 29.30 లక్షలు